క్లుప్తంగా

విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలతో కేజీబీవీ విద్యార్థినులు

యాడికి: ప్రభుత్వం అందిస్తున్న కళ్లద్దాలను సద్వినియోగం చేసుకోవాలని యాడికి నేత్ర వైద్య నిపుణుడు మధుసూదన్‌రాజు సూచించారు. బుధవారం కేజీబీవీలో 28 మంది విద్యార్థినులకు కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ నిర్మల, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

19న వార్డు ఉప ఎన్నిక

గార్లదిన్నె: బూదేడు పంచాయతీలో 9వ వార్డు మెంబర్ స్థానానికి ముగ్గురు పోటీలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటలక్ష్మి బుధవారం తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటలక్ష్మి మాట్లాడుతూ పోటీలో ఉన్న సుంకమ్మకు స్టూల్, నాగేంద్రకు ప్రెషర్ కుక్కర్, నాగన్నకు గౌను గుర్తు కేటాయించామన్నారు. బూదేడు ప్రాథమి కోన్నత పాఠశాలలో ఈనెల 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం ఎన్నికల కౌంటింగ్ ఉంటుందన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

యాడికి: మండల కేంద్రంలో 19వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి ఉన్నత పాఠశాలలో 12ఎ, 12బీ గదుల్లో గల పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారి జిలాన్‌బాషా, పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి బుధవారం పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లపై పంచాయతీ సిబ్బందితో ఆరా తీశారు. కేంద్రం వద్ద ఓటర్లకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వారికి సూచించారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుత్తి: 14వ వార్డులో బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బంది వార్డులోని డ్రైనేజీలను శుభ్రం చేశారు. చెత్తా చెదారాన్ని తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

ప్రమీలకు సన్మానం



ప్రమీలను సన్మానిస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

శింగనమల: ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీలను బుధవారం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు సీ.బండమీదపల్లిలోని ఆమె ఇంటి వద్ద సన్మానించారు. బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ నీలం భాస్కర్, చెదుళ్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చేపల రమణ, స్టోర్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బండి పురుషోత్తం, చికెన్ నారాయణస్వామి, సాకే లక్ష్మీనారాయణ తదితరులు ప్రమీల దంపతులను శాలువాతో సత్కరించారు.

నేడు కత్రిమలలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: కత్రిమల గ్రామంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మండల అధికారులు

పుట్లూరు: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఫీడర్ మార్పు, కొత్తలైన్ల ఏర్పాటు గురించి సర్పంచ్‌లు ట్రాన్స్‌కో ఏఈ విజయుడిని ప్రశ్నించారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత, ఎంపీడీఓ యోగానందరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్, ఇతర అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకూ'

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



బుక్కాపురం గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



బుక్కాపురంలో సంక్షేమలబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. బుధవారం బుక్కాపురం, కొడవండ్లపల్లి, ఆరవేడు గ్రామాల్లో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ పూజారి గంగాదేవి, సర్పంచు లక్ష్మీదేవితో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొడవండ్లపల్లిలో చిత్రకారుల లక్ష్మీదేవికి రూ.4,72,498, బుక్కాపురంలో కె. హైమావతికి రూ.5,06,650, ఆరవేడులో జి.పెద్దన్న రూ.2,63,731 లబ్ధి చేకూరినట్లు వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పట్టించారన్నారు. సైనికుడిలా జగనన్న నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చూసి చంద్రబాబు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపు, చంద్రబాబు ఓటమి తప్పదన్నారు.

అట్టహాసంగా ప్రభుత్వ భవనాల ప్రారంభం

బుక్కాపురం, గడ్డంవారిపల్లి గ్రామాల్లో బుధవారం నూతన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాల ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రజలకు అన్నిరకాల సేవలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న గ్రామ సచివాలయాలు ప్రారంభించారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్నిరకాల సేవలు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌తో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఎమ్మెల్యే బుక్కాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సక్రమంగా సేవలు అందించాలని కార్యకర్తకు సూచించారు. మండల స్పెషలాఫీసరు ఫిరోజ్‌ఖాన్, సర్పంచులు రామాంజులరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రామాంజినేయలరెడ్డి, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, గడ్డంవారిపల్లి రామకృష్ణారెడ్డి, దంతపల్లి పెద్దిరెడ్డి, ఉపేంద్ర మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, జాఫర్, యల్లనూరు మూర్తి, పాతపల్లి తిరుపాల్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ రామకృష్ణ, వైద్యురాలు కీర్తన, సాయినాగశ్రీ, ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, విద్యుత్ ఏఈ పద్మనాభరెడ్డి, పీఆర్ ఏఈ నరేంద్ర పాల్గొన్నారు.

కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్



గార్లదిన్నెలో తాపీ మేస్త్రీలకు ఉచిత ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్ అని కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాయుపుత్ర ఏజెన్సీ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌పై వివరించారు. స్లాబ్‌కు భారతి సిమెంట్ అనుకూలమైందన్నారు. పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్నారు.అనంతరం తాపీ మేస్త్రీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్‌లు అందజేశారు. డీలర్ అనిమి రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాలని పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ తదితరులు

గుత్తి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేతలు సునీల్, మున్నా, చెన్నాజీ బుధవారం గుత్తి నుంచి గుంతకల్లులోని మస్తానయ్య దర్గా వరకు పాదయాత్ర చేపట్టారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నేత మధుసూదన్‌రెడ్డి, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్, మున్నా, చెన్నాజీ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజా సంక్షేమం జరగాలన్నా మరోసారి జగనన్న సీఎం కావాలన్నారు. మస్తానయ్య దర్గాకు చేరుకుని ప్రత్యేక పార్థనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వరదరాజులు, ఫరూక్, నజీర్, వాల్మీకి శివ, కేవీ రమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హోమియో మందు పంపిణీ



విద్యార్థులకు హోమియో మందులు అందిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో బుధవారం పామిడి లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్లకలక నివారణకు ముందస్తుగా హోమియో మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కంటి నొప్పి, కళ్లు ఎరుపెక్కటం, వాయడం, దురద, మంట, నీరు కారటం, ఏదో గుచ్చుకున్నట్లు అనిపించడం వంటివి కళ్లకలక లక్షణాలన్నారు. తరచూ చేతులు, కళ్లను శుభ్రం చేసుకోవడం, మెత్తని వస్త్రంతో కళ్లను తుడుచుకోవడం, ఇతరులతో చేతులను కలపనివ్వకపోవడం వంటివి పాటిస్తే ఈవ్యాధి సోకకుండా నివారించవచ్చన్నారు. అనంతరం 1000 మంది విద్యార్థులకు ఉచితంగా హోమియో మందులను అందజేశారు. క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ డాక్టర్ మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షుడు పీసే జయరాంరావు, ప్రధాన కార్యదర్శి రఘువీర్, కోశాధికారి షెక్షావలి, సభ్యులు రోషన్‌జమీర్, సుహాస్ కుమార్, సాయికిరణ్, మంజునాథ్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ తాగాదా కేసులో ఏడుగురికి రిమాండ్

గార్లదిన్నె: కొప్పలకొండలో భూ తాగాదాకు సంబంధించి బుధవారం ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. గ్రామంలో ఈ ఏడాది మార్చిలో నారాయణ, భాస్కర్ వర్గాలు భూ తాగాదా విషయమై ఘర్షణ పడ్డారన్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి అనంతపురం కోర్టులో హాజరు పరిచామని, జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

నేడు గొర్రెల పెంపకందారులకు శిక్షణ

శింగనమల: స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో గొర్రెల పెంపకం దారులకు గురువారం(ఒక రోజు) శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ పద్మానాభరావు తెలిపారు. ప్యాపిలి గొర్రెల పెంపక దారుల శిక్షణ కేంద్రం సిబ్బంది గొర్రెల పెంపకంలో పాటించాల్సిన మెలకువలను తెలియజేస్తారన్నారు. గొర్రెల పెంపకందారులు హాజరుకావాలని కోరారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గుత్తి రూరల్: గొందిపల్లిలో ఓ మహిళ పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జయమ్మ బుధవారం గ్రామ శివారులోని తన వేరుశనగ పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. జయమ్మ బిగ్గరగా కేకలు వేయగా పక్క పొలంలో పనులు చేస్తున్న రైతులు వచ్చి పామును చంపారు. వెంటనే జయమ్మను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు.

ఎస్‌బీఐలో ఆధార్ సేవలు ప్రారంభం

బుక్కరాయసముద్రం: స్థానిక స్టేట్ బ్యాంక్‌లో బుధవారం నుంచి ఆధార్ సేవలు ప్రారంభించినట్లు బ్యాంక్ సిబ్బంది బుధవారం తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు, ఆధార్-పాన్‌కార్డు అనుసంధానం, ఆధార్, ఫోన్‌నంబరుకు లింక్ తదితర సేవలు అందిస్తామన్నారు.

వార్డుల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



పిన్నేపల్లెలో ఓటర్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యాడికి: ఈ నెల 19న జరగనున్న వార్డు సభ్యుల ఎన్నికల్లో యాడికి 19వ వార్డు, రాయలచెరువు 12వ వార్డు అభ్యర్థులుగా బరిలో ఉన్న శ్రీరాములు, మొక్కల రేవతి గౌను గుర్తుకే ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, నాయకులు నాగేష్, రషీద్, రవికాంత్ చౌదరి ప్రజలను కోరారు. బొంబాయి రమేష్ నాయుడు యాడికి 19వ వార్డులోని పిన్నేపల్లె, వీరన్నపల్లె, చంద్రాయునిపల్లె, రామన్న గుడిసెలు, రెడ్డివారి గుడిసెలలో ఇంటింటా ప్రచారం చేశారు. రాయల చెరువు పంచాయతీలోని 12వ వార్డులో రాయల చెరువులోని కొత్త ఇండ్ల వద్ద , రామరామ రాజుపల్లె గ్రామాల్లో బుధవారం సాయంత్రం నాగేష్ తన అనుచరులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంత రెడ్డి, డీలర్ మల్లికార్జున, ఉపేంద్రగౌడ్, శివయ్య, రంగ, అంజి తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కాలనీకి రోడ్డు వేయించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మోదినాబాద్ నాయీ బ్రాహ్మణ కాలనీకి రోడ్డును వేయించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను పట్టణ నాయీబ్రాహ్మణ సేవాసంఘం నాయకులు కోరారు. బుధవారం కమిషనర్‌ను సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మినారాయణ, వేణుగోపాల్ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీ ఏర్పడి 18 ఏళ్లు అవుతున్నా నేటికీ రోడ్డును వేయకపోవడంతో రైల్వేట్రాక్‌ను దాటి కాలనీలోకి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రైల్వేట్రాక్ దాటే సమయంలో పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. సంఘం నాయకులు మాణిక్యం, మోహన్, బ్రహ్మయ్య, నానీ, హరి, లింగమూర్తి పాల్గొన్నారు.

వార్డు సభ్యుడికి పరామర్శ



ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీ వార్డు సభ్యుడు ప్రసాద్‌ను ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి బుధవారం పరామర్శించారు. ప్రసాద్ కాలనీలో విద్యుదాఘాతానికి గురైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఆలూరి సాంబశివారెడ్డి ప్రసాద్ ఇంటికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలు మనేరి కొండమ్మ, చికెన్ నారాయణస్వామి, పురుషోత్తం, విశ్వరూప తదితరులు ఉన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గార్లదిన్నె: మర్తాడులో గురువారం ఉదయం 8.30 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద పేకాట ఆడుతున్న 9 మందిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వారి నుంచి రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాడిపత్రి: గంగాదేవి పల్లి గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామన్నారు.

ప్రత్యామ్నాయం.. శ్రేయస్కరం

- తక్కువ నీటితో పంటల సాగు
- ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి





భద్రంపల్లిలో సాగు చేసిన ఉలవ పంట

బుక్కరాయసముద్రం: వర్షాభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు శ్రేయస్కరమని ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి తెలియజేశారు. దీర్ఘకాలిక పంటలు సాగుకన్నా తక్కువ పెట్టుబడి, నీటితో చిరుధాన్యాలు వేసుకోవచ్చని చెబుతున్నారు. చిరుధాన్యాల సాగుపై తన అభిప్రాయాలను ఏఓ సాక్షితో పంచుకున్నారు. దీర్ఘకాలిక పంటల సాగుకు నీరు అధికంగా ఎంతో అవసరం ఉంటుందన్నారు. పంట సాగుకు కూడా పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరమవుతాయన్నారు. పంట చేతికి వచ్చే లోపు చీడ పీడలు, అనేక రకాల ఒడుదొడుకులను ఎదుర్కోకోవాల్సి ఉంటుందన్నారు. చిరుధాన్యాలు 90-120 రోజుల వ్యవధిలో చేతికి వస్తాయని, వాటికి మార్కెట్‌లో డిమాండ్ ఉందని తెలియజేశారు.

80 శాతం రాయితీతో విత్తనాలు..

ప్రభుత్వం చిరుధాన్యాల సాగు చేసే రైతులకు 80 శాతం రాయితీతో సరఫరా చేస్తోంది. రాయితీ పోను కొర్రలు 2 కేజీలు రూ.27, అలసందలు ఒక కిలో రూ.23, పెసలు 4 కేజీల ప్యాకెట్ రూ.94 చెల్లించాల్సి ఉంటుంది. రైతులు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.

కంది : ఎకరాకు 3-4 కిలోల విత్తనాన్ని వేసుకోవాలి. భూసారాన్ని బట్ట ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేసుకోవాలి. పూత కాయ దశలో ఉన్నప్పుడు మారుకా మచ్చల పురుగు నివారణకు 1మిల్లీ నోవాల్యురాన్ లేదా క్లోరిపైరిఫాస్‌ను కలిపి పిచికారి చేయాలన్నారు.

పెసర : పెసరను ఎకరాకు 6-7 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలి. వరుసల మధ్య 30 సెంటీమీటర్లు దూరం ఉండేలా చూసుకోవాలి. భూసారాన్ని బట్టి ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ను ఎరువుగా వేసుకోవాలి. విత్తిన 20-30 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. తొలి దశలో రసం పీల్చే పురుగులు పూత కాయ దశలో మారుకా మచ్చల పురుగు నివారణ చర్యలు చేపట్టాలి.

జొన్న : ఎకరాకు 4 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య 45 సెంటీమీటర్లు మొక్కల మధ్య 12-15 సెంటీ మీటర్లు దూరంలో గొర్రుతో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాక్సాం కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్‌ను ఎరువుగా వేసుకోవాలి. విత్తేటప్పుడు 10 కేజీలు యూరియా, 30 రోజులకు 10 కేజీల యూరియా వేసుకోవాలి. కలుపు నివారణకు 800 గ్రాముల అట్రాజిన్ 200 లీటర్ల నీటికి కలిపి తడి నేలకు పిచికారీ చేయాలి. 30 రోజుల తరువాత గుంటకతో అంతర కృషి చేయాలి. మువ్వ చంపే ఈగ నివారణకు కార్బోఫ్యూరాన్ గులికలు ఎకరాకు 4 కిలోల చొప్పున మొక్కల సుడుల్లో వేయాలి.

సజ్జ : ఎకరాకు ఎకరాకు ఒకటిన్నర కిలో విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 12-15 సెంమీ దూరంలో గొర్రుతో విత్తుకోవాలి. ఎకరాకు 50 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 35 కిలోల పొటాస్ ఎరువులను వేసుకోవాలి. కలుపు నివారణకు ఎకరాకు 600గ్రాములాట్రాజిన్ మందును 200 లీటర్ల నీటికి కలిపి తడి నేలపై పిచికారి చేయాలి. 30 రోజుల తరువాత దంతులతో లేదా గుంటకతో అంతర కృషి చేయాలి.

కొర్ర : ఎకరాకు 2 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య 20-22 సెంమీ మొక్కల మధ్య 7 సెంమీ దూరంలో గొర్రుతో విత్తుకోవాలి. ఎకరాకు యూరియా 35 కిలోలు, 50 కిలోలు సింగిల్ ఫాస్పేట్ ఎరువులను వేసుకోవాలి.

అలసంద : ఎకరాకు 8-10 కిలో విత్తనాన్ని విత్తుకోవాలి. వరుసల మధ్య 30-45 సెం.మీ దూరంలో ఉండేలా విత్తుకోవాలి. భూసారాన్ని బట్టి ఎరువులు వేసుకోవాలి.

అనుములు : ఎకరాకు 6-8 కి5లోల విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య1-1.5 దూరంలో విత్తుకోవాలి. 5 శాతం వేపగింజల కషాయం పూత కాయ దశలో వున్నప్పుడు పిచికారీచేయాలి. వీటి ద్వారా చీడ పీడలను నివారించుకోవచ్చు.

ఉలవ: ఎకరాకు 10 కిలోలు గొర్రుతో విత్తుకోవాలి. 8 కిలోల యూరియా, 50 కిలోల సింగిల్ ఫాస్పేట్ 15 కిలోల పొటాష్ ఎరువులను విత్తేముందు వేసుకోవాలి.

నెట్టికంటుడి సన్నిధిలో ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ దంపతులకు స్వామి తీర్థప్రసాదాలను అందిస్తున్న ఆలయ సిబ్బంది

గుంతకల్లు రూరల్: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి దంపతులు బుధవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఉదయాన్నే ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ, ఆయన సతీమణి ఉమాదేవి దంపతులకు ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు శివరామిరెడ్డి దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

రీసర్వే సద్వినియోగం చేసుకోండి

తాడిపత్రి: పట్టణ పరిధిలోని ఖాళీ స్థల యజమానులు వైఎస్సార్‌జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కింద భూసర్వేను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్థల యజమానులు డాక్యుమెంట్లను వార్డు సచివాలయాల్లో అడ్మిన్లను అందించి హక్కు పత్రాలు పొందాలని తెలిపారు. అర్హులైన వారందరికీ త్వరలోనే జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పత్రాలను అందిస్తామని పేర్కొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

గుంతకల్లు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంటసాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ కే స్వాతి సూచించారు. బుధవారం ఆమె మొలకలపెంట, ఓబుళాపురంలో ఆర్బీకే సిబ్బంది చేపట్టిన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పంటనమోదు కార్యక్రమం ముగుస్తుందన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులందరూ గురువారం నుంచి పంట నమోదు చేయించుకోవాలని ఏఓ సోమశేఖర్ తెలిపారు. బుధవారం ఏఓ విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో పంటలు వేసిన రైతులు ఆర్బీకేల్లో సిబ్బందిని సంప్రదించి సెప్టెంబర్ 15 లోపు పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

19న టెంకాయల విక్రయ హక్కు వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి సన్నిధిలో ఈనెల 19న టెంకాయల విక్రయం హక్కు కోసం బహిరంగవేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. మాఘమాసం మినహా విడిదినాల్లో మాత్రమే టెంకాయల విక్రయం హక్కు కోసం వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.50 వేలు చెల్లించి వేలంలో పాల్గనాలని సూచించారు.

నేడు విద్యార్థుల ర్యాలీ

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఈ విద్యాసంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం వైఎస్.జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈమేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ గరల్స్‌హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరకు ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

హంద్రీ-నీవాకు నీరు విడుదల చేయాలి

గుంతకల్లుటౌన్: హంద్రీనీవా కెనాల్‌కు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి త్వరితగతిన నీటిని విడుదల చేయించి పంటసాగు చేసిన రైతన్నలను ఆదుకోవాలని హెచ్‌ఎన్ఎస్ఎస్ టెక్నికల్ ఆఫీసర్ ఈశ్వర్‌రెడ్డిని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు టీఓను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. హంద్రీనీవా, జీఎస్‌బీసీల కింద రైతులు పత్తి, మిరప, మొక్కజొన్న, వేరుశనగ పంటలను సాగు చేశారని, సకాలంలో వర్షాలు కురవని కారణంగా పంట నష్టం వాటిల్లేప్రమాదముందన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిమి రామాంజి, నాయకులు సూర్యనారాయణ, విజయలక్ష్మి, బండిమురళీ, పద్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా చేయాలి

పెద్దవడుగూరు: మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా చేయాలని ఎంఈఓ రాముడు నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం బుర్నాకుంట, ముప్పాలగుత్తి పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.